క్లుప్తంగా

మట్టి అక్రమ తవ్వకం అడ్డగింత



కె.తాడేపల్లి(విజయవాడరూరల్): కొత్తూరు తాడేపల్లి ఫారెస్ట్ ఏరియా పోలవరం కాల్వ వద్ద అక్రమంగా మట్టి తవ్వకాలు జరుపుతున్న పొక్లెయిన్‌ను వైఎస్సార్ సీపీ గ్రామ అధ్యక్షుడు కర్నాటి రాంబాబు గురువారం ఆపార్టీ కార్యకర్తలతో వెళ్లి అడ్డుకున్నారు. బుడమేరు కాల్వకు పడిన గండ్లు పూడ్చే కాంట్రాక్ట్ పనులకు పోలవరం రబ్బీష్‌ను తీసుకెళ్లేందుకు సంబంధిత అధికారులు అనుమతులు మంజూరు చేశారని పొక్లెయిన్ సిబ్బంది తెలుపగా, రాంబాబు వెంటనే ఫోన్ ద్వారా సంబంధిత అధికారులను సంప్రదించారు. అయితే తాము ఎవ్వరికి ఎటువంటి అనుమతులు ఇవ్వలేదని అధికారులు తెలియజేయడంతో రాంబాబు, కార్యకర్తలు కలిసి పొక్లెయిన్‌ను అడ్డుకుని అధికారులకు సమాచారం అందించారు.

రోడ్డు నిర్మాణం కోరుతూ గ్రామస్తుల రాస్తారోకో



తిరువూరు: ఏకొండూరు మండలం రామచంద్రాపురంలో అసంపూర్తిగా నిలిచిపోయిన ఇబ్రహీంపట్నం–జగదల్‌పూర్ జాతీయ రహదారి నిర్మాణం పూర్తి చేయాలని కోరుతూ గ్రామస్తులు గురువారం రాస్తారోకో చేశారు. పదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న రోడ్డు నిర్మాణాన్ని అధికారులు పూర్తిచేయడం లేదని విమర్శించారు. ఎన్నికల సమయంలో ఇచ్చే హామీలను పాలకులు నెరవేర్చట్లేదని ఆరోపించారు. రహదారి గోతులమయమై ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. వాహనాల రాకపోకల సందర్భంగా దుమ్ము, ధూళి లేచి ప్రజలు శ్వాసకోశ వ్యాధుల బారిన పడుతున్నారని వాపోయారు. సమస్య పరిష్కారానికి అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

అంగన్‌వాడీలు అంకితభావంతో పనిచేయాలి




నూజివీడు: అంగన్‌వాడీ కార్యకర్తలు అంకితభావంతో పనిచేసి నూజివీడు ఐసీడీఎస్ ప్రాజెక్టును జిల్లాలోనే అగ్రస్థానంలోకి తీసుకెళ్లాలని ఐసీడీఎస్ సీడీపీవో పిల్లి విజయకుమారి సూచించారు. స్థానిక సీడీపీవో కార్యాలయం వద్ద గురువారం అంగన్‌వాడీ కార్యకర్తల సంఘానికి చెందిన పలు యూనియన్ల నాయకులు, సూపర్‌వైజర్లతో గురువారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ గర్భిణులు, బాలింతలు, చిన్నారులకు సక్రమంగా పౌష్టికాహారాన్ని అందించాలన్నారు. అంగన్‌వాడీ కేంద్రాలను సెలవు రోజుల్లో మినహా మిగిలిన అన్నిరోజుల్లో తప్పనిసరిగా సమయానికి తెరవాలన్నారు. ప్రభుత్వం అమలుచేస్తున్న కార్యక్రమాలను గర్భిణులు, బాలింతలు, కిశోర బాలికలకు తెలియజేయాలన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలకు ఏమైనా సమస్యలుంటే ముందుగా తనదృష్టికి తీసుకొస్తే వాటిని పరిష్కరిస్తానని వివరించారు.

గ్రామాల్లో పారిశుధ్య పనులు



చాట్రాయి: గ్రామాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తుగా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో గురువారం పారిశుధ్య పనులు చేపట్టారు. ఈ సందర్భంగా చనుబండ, నరసింహారావుపాలెం గ్రామాల్లో మురుగు నీటి నిల్వలు, చెత్త కుప్పలను తొలగించారు. డ్రెయినేజీల్లో దోమల నివారణకు ఎబెట్ పిచికారీ చేశారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచ్‌లు విస్సంపల్లి ప్రశాంతి, విస్సంపల్లి జ్యోతి, పీహెచ్‌సీ వైద్యులు దుర్గా ప్రసాద్, హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుకు నారు సిద్ధం



తిరువూరు: ఖరీఫ్ వరిసాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. మండలంలో 18వేల ఎకరాల్లో వరి సాగయ్యే అవకాశం ఉండగా, సాగునీటి వసతి ఉన్న గ్రామాల్లో రైతులు వరినాట్లకు నారు సిద్ధం చేస్తున్నారు. కోకిలంపాడు, మల్లేల, మునుకుళ్ళ, అక్కపాలెం, లక్ష్మీపురం, చిట్టేల, చౌటపల్లి, ఆంజనేయపురం గ్రామాల్లో వెదజల్లే పద్ధతిలో వరిసాగు ప్రారంభించారు. చెరువుల్లో అరకొరగా నీరుండటంతో పలువురు రైతులు సాగుకు వెనుకాడుతున్నారు. నైరుతి రుతుపవనాల ప్రభావంతో వర్షాలు కురుస్తాయని రైతులు ఆశిస్తున్నారు.

లాభసాటిగా ఆకుకూరల సాగు

- తక్కువ పెట్టుబడితో అధిక రాబడి
- నెలరోజులకే కోతకొస్తున్న ఆకుకూరలు
- సస్యరక్షణ చర్యలు చేపట్టాలంటున్న ఉద్యానశాఖ అధికారులు



కేతనకొండలో సాగవుతున్న తోటకూర మడులు

ఇబ్రహీంపట్నం: ఈ ఏడాది ఇబ్రహీంపట్నం మండలంలో పసుపు, పత్తి, మిరప పంటలు సాగుచేసి తీవ్రనష్టాలు చవిచూసిన రైతులు ప్రస్తుతం ఆకుకూరల సాగుకు మొగ్గుచూపారు. నెల రోజులకే మొక్క ఎదుగుదలకు వస్తుండటం, తక్కువ పెట్టుబడి, అధికలాభాలు వస్తుండటంతో మండలంలోని మూలపాడు, కేతనకొండ, కొటికలపూడి, త్రిలోచనాపురం, లంక గ్రామాల రైతులు సుమారు 100 ఎకరాల్లో ఆకుకూరల సాగు చేపట్టారు.

ఏడాదిలో నాలుగు విడతల సాగు..

ఆకుకూరలను ఏడాదిలో నాలుగు విడతలుగా సాగు చేయవచ్చని రైతులు చెబుతున్నారు. ఆకుకూరల సాగులో తక్కువ పెట్టుబడితో అధిక రాబడిని సాధించవచ్చని ఈప్రాంత రైతులు రుజువు చేస్తున్నారు. ఎకరా పొలంలో మూడు రకాల ఆకుకూరల సాగు చేస్తున్నారు. తోటకూరలో ఏఆర్ఎస్ఏ రకం సాగు చేపట్టారు. విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, కలుపు, కూలీలు ఖర్చు సుమారు రూ.10వేలు ఖర్చవుతుండగా, నెలరోజుల్లో కోతకు వస్తుంది. ఒక్కో కట్ట ధర రూ.5 నుంచి రూ.10 వరకు విక్రయిస్తున్నారు. నెలలో పెట్టుబడి ఖర్చులు పోను రూ.15వేలు నుంచి రూ.20వేలు వరకు ఆదాయం వస్తోందని రైతులు చెబుతున్నారు. ఆకుకూరల్లో ఆరోగ్యానికి అవసరమైన కాల్షియం, ఐరన్ వంటి పోషకాలు విరివిగా ఉండటంతో ప్రతిఒక్కరూ వీటి కొనుగోలుకు మొగ్గుచూపుతున్నారు.

ఏడాది పొడవునా ఆదాయం...

కొందరు రైతులు వ్యవసాయ పొలాన్ని మళ్లుగా కట్టి వివిధ రకాల ఆకుకూరలు సాగు చేస్తున్నారు. ఎకరా భూమిలో మళ్లు తయారు చేసి గోంగూర, తోటకూర, బచ్చలికూర, చుక్కకూర, పాలకూర, పుదీనా, కొత్తిమీర సాగు చేస్తున్నారు. సీజన్ ఆధారంగా పంటను ఎంపిక చేసుకుంటున్నారు. విత్తనాలు చల్లినప్పటి నుంచి మొక్క ఎదిగేవరకు కంటికి రెప్పలా కాపాడుకుంటున్నారు. వారానికి ఒకసారి సస్యరక్షణ మందులు, కలుపు తీయటం, నీరు అందించటం, కొద్దిమోతాదులో యూరియా, కాంప్లెక్స్ ఎరువులు వినియోగిస్తే నెలరోజులకే మొక్కలు కోతకొస్తున్నాయి. ముందుగా ఏపుగా పెరిగిన మళ్లల్లో రైతులే మొక్కలు పీకి కట్టలు కట్టి వ్యాపారులకు అమ్ముతారు. కొంతమంది రైతులు సమీపంలోని రైతుబజారుకు తరలిస్తున్నారు. మొక్కలు పీకిన ప్రదేశంలో మళ్లీ నారుమళ్లు పోస్తారు. ఏడాది పొడవునా ఆకుకూరల సాగు రైతులకు కాసుల వర్షం కురిపిస్తుంది.

ఆకుకూరలతో కుటుంబం గడుస్తోంది..



గతంలో పత్తి, మిర్చి, పసుపు వంటి వాణిజ్య పంటలు సాగుచేశాను. పెట్టుబడులు రాక, గిట్టుబాటు ధరలేక ఇబ్బందులు పడ్డాను. మూడేళ్లుగా ఆకుకూరల సాగు చేస్తున్నాను. దిగుబడులు కూడా లాభసాటిగా ఉన్నాయి. నెలకు రూ. 15 నుంచి రూ.20వేలు వరకు వస్తున్నాయి. కుటుంబ పోషణకు ఇబ్బంది లేకుండా ఉంది.

– పుప్పాళ్ల వెంకట్రావు, రైతు, కేతనకొండ

సస్యరక్షణ చర్యలు కీలకం..



ఆకుకూరల సాగులో సస్యరక్షణ చర్యలు అత్యంత కీలకం. విత్తన ఎంపికలో మెలకువలు పాటించాలి. తక్కువ అవశేషాలు కలిగిన పురుగు మందులే వాడాలి. గొంగళి పురుగుల నివారణకు మలాథియన్ పిచికారీ చేయాలి. ఆకుమచ్చతెగుళ్లు ఉంటే మూడు గ్రాముల కాపర్ ఆక్సీక్లోరైడ్ లీటర్ నీటిలో కలిపి చల్లుకోవాలి. పురుగు మందు పిచికారీ చేసిన పది రోజుల తర్వాతే ఆకు కూరలు కోయాలి.

– నీలిమ, ఉద్యానశాఖ అధికారి, ఇబ్రహీంపట్నం

అవగాహనతోనే సికిల్ సెల్ వ్యాధి నిర్మూలన

కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశ తదితరులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): సంపూర్ణ అవగాహనతో సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన సాధ్యమవుతుందని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. ప్రపంచ సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని గురువారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో కొండపల్లి గిరిజన సంక్షేమ బాలికల పాఠశాలలో సికిల్ సెల్ వ్యాధిపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులతో కలిసి కలెక్టర్, సికిల్‌సెల్ ఎనీమియా వ్యాధి నిర్మూలన మిషన్ పోస్టర్లు ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ సాధారణంగా ఆరోగ్యకరమైన ఎర్ర రక్తకణాలు గుండ్రంగా ఉంటే సికిల్ సెల్ వ్యాధిలో ఈ కణాలు కొడవలి ఆకారంలో ఉంటాయని వివరించారు. ఈ వ్యాధి తల్లిదండ్రుల నుంచి అనువంశికంగా సంక్రమిస్తుందని, ఇది అంటు వ్యాధి కాదని వివరించారు. రక్త పరీక్షల ద్వారా వ్యాధిని నిర్ధారించవచ్చన్నారు. సికిల్ సెల్ ఎనీమియా వ్యాధి ఉన్న వ్యక్తి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, సకాలంలో గుర్తించి సరైన వైద్య సదుపాయాలు అందించడం ద్వారా రోగి జీవన నాణ్యతను పెంచొచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఛైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, వైస్ ఛైర్‌పర్సన్ సీహెచ్ శ్రీనివాస్, డీఎంహెచ్‌వో డాక్టర్ ఎం.సుహాసిని, డీటీడబ్ల్యూవో విజయశాంతి, ప్రోగ్రాం అధికారి డాక్టర్ మాధవి, వైద్యాధికారులు పద్మావతి, విజయకుమార్, నోడల్ అధికారి నవీన తదితరులు పాల్గొన్నారు.

కేవీకి తాత్కాలిక భవనాన్ని సిద్ధం చేయాలని వినతి



సబ్‌కలెక్టర్ స్మరణ్‌రాజ్‌కు సమస్యను వివరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు

నూజివీడు: నూజివీడుకు కేటాయించిన కేంద్రీయ విద్యాలయం(కేవీ) నిర్వహణకు తాత్కాలిక భవనాన్ని త్వరితగతిన సిద్ధం చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు జిల్లా అధికారులను కోరారు. ఈ మేరకు గురువారం ఆయన సబ్‌కలెక్టర్ బచ్చు స్మరణ్‌రాజ్‌ను కలిసి విజ్ఞప్తి చేశారు. ఈసందర్భంగా మాజీఎమ్మెల్యే ఎంవీపీ అప్పారావు మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఎంతో కష్టపడి కేంద్రీయ విద్యాలయాన్ని నూజివీడుకు తెచ్చామని, దీనికి ట్రిపుల్ ఐటీ వద్ద ఏడెకరాల స్థలాన్ని సైతం గత ప్రభుత్వం కేటాయించిందన్నారు. ఆ స్థలంలోని పిచ్చి చెట్లు, ముళ్ల పొదలు తొలగించడంతోపాటు తాత్కాలిక భవనాన్ని తమకు అప్పగించాలని కేంద్రీయ విద్యాలయం ఉన్నతాధికారులు ఈ ఏడాది ఫిబ్రవరి నుంచి అడుగుతున్నా స్థానిక మున్సిపాలిటీ అధికారులు మాత్రం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తూ పట్టించుకోవడం లేదన్నారు. ఏప్రిల్‌లో నూజివీడులో కలెక్టర్ కె.వెట్రిసెల్వీ నేతృత్వంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఈ సమస్యను పలువురు ప్రజాప్రతినిధులు జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లో పనులను పూర్తి చేసి భవనాన్ని, స్థలాన్ని కేంద్రీయ విద్యాలయ సమితికి అప్పగించాలని మున్సిపల్, రెవెన్యూ అధికారులను ఆదేశించినా ఇంత వరకు ఒక్క అంగుళం కూడా అడుగు ముందుకు పడలేదన్నారు. ఇప్పటికైనా అధికారులు పెండింగ్ పనులు పూర్తిచేసి తాత్కాలిక భవనాన్ని కేంద్రీయ విద్యాలయ సమితికి అప్పగించాలన్నారు. జెడ్పీ వైస్ ఛైర్మన్ గుడిమళ్ల కృష్ణంరాజు, మున్సిపల్ వైస్ ఛైర్మన్ కొమ్ము వెంకటేశ్వరరావు, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు శీలం రాము, జిల్లా అధికార ప్రతినిధి కంచర్ల లవకుమార్, క్రిస్టియన్ మైనారిటీ జిల్లా అధ్యక్షుడు పిళ్లా చరణ్, బసవా వినయ్, రామకృష్ణ, చేబత్తిన మున్నా, కళ్లేపల్లి ఆదినారాయణ, కలపాల కృపారావు, ఉదయగిరి కృపారావు పాల్గొన్నారు.

ఐటీటీలో నైపుణ్యం ఎంతో అవసరం



మాట్లాడుతున్న ప్రొఫెసర్ రామనారాయణరెడ్డి

మైలవరం: అధ్యాపకులకు ఐటీటీలో నైపుణ్యం పెంపొందించుకోవాలని ఇందిరాగాంధీ ఢిల్లీ టెక్నికల్ యూనివర్శిటీ ఫర్ ఉమెన్ ప్రొఫెసర్ ఎస్.రామనారాయణరెడ్డి సూచించారు. మైలవరం లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో గురువారం రియల్ వరల్డ్ ఇన్‌సైట్స్ అనే అంశంపై అధ్యాపకులకు వర్క్‌షాపు నిర్వహించారు. రిసోర్స్‌పర్సన్‌గా హాజరైన ప్రొఫెసర్ ఎస్.రామనారాయణరెడ్డి మాట్లాడుతూ ఎంబెడెడ్ సిస్టమ్స్, ఇంటర్నెట్ ఆఫ్ థింగ్స్‌లో అధ్యాపకుల నైపుణ్యాన్ని పెంపొందించడం, రియల్ టైమ్ అప్లికేషన్స్, ఉత్పత్తి అభివృద్ధిపై దృష్టి సాధించడమే ఈ వర్క్‌షాపు ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఎంబెడెడ్ సీ అండ్ అసెంబ్లీ ఫర్ ప్రొడక్ట్ డిజైన్, ఐటీటీ సిస్టమ్ డిజైన్ అండ్ యూజ్ కేసెస్‌పై ఇంటరాక్టివ్ సెషన్లు, విద్యా ఆవిష్కరణలలో ఐటీటీ పాత్రను వివరించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.అప్పారావు మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపుల ద్వారా అధ్యాపకులు అనేక అంశాలను నేర్చుకోవచ్చని పేర్కొన్నారు. కార్యక్రమంలో కన్వీనర్ అండ్ హెచ్‌ఓడీ డాక్టర్ ఎస్.నాగార్జునరెడ్డి, సీఎస్ఈ సమన్వయకర్త డాక్టర్ సీహెచ్ వెంకటనారాయణ, ఫాకల్టీ కోఆర్డినేటర్లు డి.అనిల్ కుమార్, ఎం. గాయత్రి, ఆయా విభాగాల అధ్యాపకులు పాల్గొన్నారు.

ఫ్లోరోసిస్‌పై ఆరోగ్యశాఖ సర్వే



చౌటపల్లి(తిరువూరురూరల్): మండలంలోని చౌటపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్ర పరిధిలోని పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాల్లో గురువారం ఫ్లోరోసిస్ వ్యాధిపై సర్వే నిర్వహించారు. విద్యార్థులకు దంత పరీక్షలు చేసి ఫ్లోరోసిస్ లక్షణాలున్న వారిని గుర్తించారు. జిల్లా ఫ్లోరోసిస్ కన్సల్టెంట్ బదరీనాథ్ మినరల్ వాటర్ ప్లాంట్లను తనిఖీ చేసి నీటినాణ్యత పరిశీలించారు. పీహెచ్‌సీ సూపర్‌వైజర్ మధుసూధనరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

విత్తనాల దుకాణాల్లో తనిఖీలు



చాట్రాయి: విత్తనాల షాపుల్లో యజమానులు విత్తనాలను మొలక శాతాన్ని తప్పకుండా ప్రదర్శించాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి షేక్ హబీబ్‌బాషా తెలిపారు. మండలంలోని పోలవరం, చనుబండ గ్రామాల్లోని ఎరువుల షాపుల్లో క్రయవిక్రయాలను గురువారం ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు కొనుగోలు చేసిన విత్తనాలు, ఎరువులకు బిల్లు ఇవ్వాలని, స్టాకు బోర్డు ప్రదర్శించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారి బి.శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలు సైనికుల్లా పనిచేయాలి



మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావును సత్కరిస్తున్న బాణావతు రాజు, నాయకులు

నూజివీడు: వైఎస్సార్ సీపీ పటిష్టతకు పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సానుభూతిపరులు తమ వంతు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ ఇన్‌చార్జి మేకా వెంకట ప్రతాప్ అప్పారావు సూచించారు. నూజివీడు మండలం లైన్‌తండాకు చెందిన మాజీ జెడ్పీటీసీ బాణావతు రాజును వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర కార్యదర్శిగా నియమించడంతో గురువారం ఎస్టీసెల్ నాయకులు రాజుతోపాటు ప్రతాప్ అప్పారావును కలిసి ఘనంగా సత్కరించారు. ఈసందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లి ప్రభుత్వ తీరును ఎండగట్టాలన్నారు. రాష్ట్రంలో పేదల పక్షాన నిలబడే పార్టీ, ప్రజల సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధి కోసం పాటు పడే పార్టీ కేవలం వైఎస్సార్ సీపీ మాత్రమేనన్నారు. అందరం కలిసి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాల్సిన చారిత్రక అవసరం రాష్ట్రంలో నెలకొందన్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది గడిచినా సూపర్ సిక్స్ హామీలతోపాటు మరో 143 హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైందని విమర్శించారు. రాబోయే రోజుల్లో వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పనిచేసి పార్టీ అధికారంలోకి వచ్చేలా చూడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో నాయకులు శ్రీను, భూక్యా మురళీ, రామిశెట్టి కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్‌పై ఉద్యోగులకు అవగాహన



మాట్లాడుతున్న విద్యుత్‌శాఖ ఎస్ఈ శ్రీనివాసరావు

ఇబ్రహీంపట్నం: విద్యుత్‌శాఖ ఉద్యోగులు ప్రధానమంత్రి సూర్యఘర్ పథకంపై ప్రజలకు అవగాహన కల్పించాలని విద్యుత్ ఆపరేషన్ విభాగం ఎస్ఈ తోట శ్రీనివాసరావు సూచించారు. విజయవాడ రూరల్ డివిజన్ విద్యుత్ ఉద్యోగులు, సిబ్బందికి స్థానిక ఎంవీఆర్ కల్యాణ మండపంలో గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ వినియోగదారుడు ఒక కిలోవాట్ సోలార్ ప్యానల్ ఏర్పాటు చేసుకుంటే రూ.30వేలు, 2కిలోవాట్స్‌కు రూ.30వేలు, 3కిలోవాట్లకు రూ.78వేలు సబ్సిడీ లభిస్తుందన్నారు. బీసీలకు అదనంగా రూ.20వేలు సబ్సిడీ వర్తిస్తుందన్నారు. సోలార్ విద్యుత్‌తో పర్యావరణానికి ఎంతో మేలు చూకూరుతుందని పేర్కొన్నారు.రూరల్ డివిజన్ ఈఈ వసంతరావు, ఆయా డివిజన్ల ఏఈలు, ఉద్యోగులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ పఠన దినోత్సవం

తిరువూరు: గంపలగూడెం మండలం పెనుగొలను శాఖా గ్రంథాలయంలో గురువారం జాతీయ పఠన దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లైబ్రేరియన్ శ్రీలత మాట్లాడుతూ గ్రంథాలయంలో లభ్యమయ్యే వివిధ రకాల పుస్తకాలను వివరాలను తెలియజేశారు. వినోదం, విజ్ఞానాన్ని పెంపొందించే పుస్తకాలను పాఠకులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. స్థానిక ఎంపీపీ స్కూలు ఉపాధ్యాయిని జి.అలేఖ్య, పాఠకులు పాల్గొన్నారు.

రేపు యోగా దినోత్సవం

తిరువూరు: స్థానిక జిల్లా పరిషత్ బాలికోన్నత పాఠశాల ఆవరణలో శనివారం ఉదయం 7 గంటలకు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు ఆర్డీవో కె.మాధురి తెలిపారు. యోగా ఇన్‌స్ట్రక్టర్ల ఆధ్వర్యంలో యోగాసనాలు వేయడంతో పాటు యోగాతో కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు.

గురుకులంలో ఖాళీ సీట్లకు దరఖాస్తుల ఆహ్వానం

తిరువూరు: స్థానిక అంబేద్కర్ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ రవిబాబు గురువారం కోరారు. ఆరో తరగతిలో ఆరు సీట్లు, ఏడో తరగతిలో 10, 8వ తరగతిలో 10, 9వ తరగతిలో 9 సీట్లు ఖాళీగా ఉన్నాయని వివరించారు. ప్రవేశ పరీక్ష దరఖాస్తుల కోసం తమ కళాశాలలో సంప్రదించాలన్నారు. ఈనెల 25న కృష్ణారావుపాలెం గురుకులంలో ప్రవేశ పరీక్ష ఉంటుందని వివరించారు .

యథేచ్ఛగా మట్టి తవ్వకాలు

- రైతుల పేరిట అనుమతులు..
- టిప్పర్లలో ప్రైవేట్ భూములకు మట్టి తరలింపు
- చోద్యం చూస్తున్న ఇరిగేషన్, రెవెన్యూ అధికారులు



లక్ష్మీపురం వెంకమ్మ చెరువులో సాగుతున్న మట్టి తవ్వకాలు

తిరువూరురూరల్: పొలాల్లో అవసరాల నిమిత్తం చెరువు మట్టి తోలుకుంటామని అనుమతి పొందిన అధికారపార్టీ నేత, ఆ మట్టిని ఇతర అవసరాలకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటున్న ఘటన తిరువూరు మండలం లక్ష్మీపురంలో యథేచ్ఛగా సాగుతోంది. ఇరిగేషన్ చెరువుల్లో మట్టి తవ్వకాలకు వాల్టా చట్టానికి లోబడి అనుమతులు ఇవ్వవలసిన అధికారులు కనీసం క్షేత్రపరిశీలన చేయకుండా గ్రీన్ సిగ్నల్ ఇవ్వడంతో, లక్ష్మీపురం వెంకమ్మ చెరువులో రెండు రోజులుగా ప్రొక్లయిన్లతో మట్టి తవ్వకాలు చేపట్టారు. మట్టిని పెద్ద ఎత్తున ట్రాక్టర్లు, టిప్పర్లతో ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. రోజుకు 100 నుంచి 150 ట్రిప్పుల మట్టిని అక్రమంగా తరలిస్తున్నారు.

ప్రైవేటు భూములకు తరలింపు...

1200 క్యూబిక్ మీటర్ల మేర మాత్రమే సమాంతరంగా మట్టిని తవ్వుకునేందుకు ఇరిగేషన్ సూపరింటెండింగ్ ఇంజినీర్ అనుమతి ఇవ్వగా, లక్ష్మీపురం చెరువులో ఇందుకు మూడు రెట్ల మట్టి తవ్వేశారు. ఆయకట్టు కంటే చెరువు లోతట్టులో 15 అడుగులకు పైగా లోతులో మట్టి తవ్వేయడంతో పంట పొలాలకు సాగునీటి సరఫరా సాధ్యపడదని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. తవ్విన మట్టిని రైతులు పొలాల్లో మెరక చేసుకోడానికి మాత్రమే తీసుకెళ్లాల్సి ఉండగా, లక్ష్మీపురం గ్రామంలో ఈ నిబంధన గాలికి వదిలి ఇతర అవసరాలకు తరలిస్తున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం నిద్రనటిస్తున్నారు. పొలం మెరక కోసం కేవలం రెండురోజులపాటు మాత్రమే మట్టి తరలింపునకు అనుమతి ఇచ్చినట్లు తిరువూరు ఇరిగేషన్ ఏఈ కిషోర్ చెబుతుండగా, సదరు అధికారపార్టీ నేత మాత్రం ఆ నిబంధనను పాటించకుండా మట్టిని ప్రైవేట్ భూములకు తరలిస్తూ సొమ్ము చేసుకుంటుండటం గమనార్హం. ఇకనైనా ఇరిగేషన్ అధికారులు స్పందించి ఈ మట్టి అక్రమ రవాణాను అడ్డుకోవాలని వెంకమ్మ చెరువు ఆయకట్టు రైతులు కోరుతున్నారు.

మహిళపై దాడి హేయమైన చర్య

ఇబ్రహీంపట్నం: సీఎం చంద్రబాబు సొంత నియోజకవర్గం కుప్పంలో అప్పు తీర్చలేదని ఓ మహిళను చెట్టుకు కట్టేసి కొట్టడం హేయమైన చర్య అని రాష్ట్ర రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఈదర రామకృష్ణ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మహిళలను వేధించడం దారుణమైన చర్య అన్నారు. ఇటువంటి ఘటనలకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో చిన్నారులు, మహిళలపై జరుగుతున్న లైంగిక వేధింపులు, దాడులను తక్షణం నివారించాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

మట్టి అక్రమ రవాణాపై ఆందోళన



నాగులూరులో మట్టి అక్రమరవాణాని ఆపాలని నిరసన వ్యక్తం చేస్తున్న రైతులు

నాగులూరు(జి.కొండూరు): రెడ్డిగూడెం మండల పరిధి నాగులూరు రావుల చెరువులో కొన్ని రోజులుగా కొనసాగుతున్న అక్రమ మట్టి రవాణాను ఆపాలని గ్రామానికి చెందిన రైతులు గురువారం నిరసన వ్యక్తం చేశారు. రైతులు మాట్లాడుతూ తాము ఇంటి అవసరాలకు, పొలాల మెరక కోసం మట్టిని తరలిస్తే అడ్డుకునే అధికారులు ఇన్నిరోజులుగా ఇటుక బట్టీలకు మట్టి తరలిపోతుంటే ఏమి చేస్తున్నారని ప్రశ్నించారు. అక్రమ మట్టి రవాణా చేస్తున్న వ్యక్తులను ప్రశ్నిస్తే ప్రభుత్వ పథకాలు రాకుండా అడ్డుకుంటామని బెదిరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. జిల్లా ఉన్నతాధికారులు వెంటనే స్పందించి మట్టి అక్రమ రవాణాని నిలిపివేయాలని గ్రామస్తులు డిమాండ్ చేశారు.

సబ్సిడీ విత్తనాల సరఫరాకు డిమాండ్



తిరువూరు: వ్యవసాయ సీజన్ ప్రారంభమై నెల కావస్తున్నా రైతులకు సబ్సిడీ విత్తనాలు సరఫరా చేయలేదని, వెంటనే సబ్సిడీ విత్తనాలందించాలని ఏపీ కౌలురైతుల సంఘం ఎన్టీఆర్ జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల డేవిడ్ డిమాండ్ చేశారు. ఎ.కొండూరు తహసీల్దారు లక్ష్మిని గురువారం ఆయన కలిసి కౌలురైతుల సమస్యలపై వినతిపత్రం అందజేశారు. అనంతరం డేవిడ్ మాట్లాడుతూ రైతులకు జీలుగ, పిల్లిపెసర, పెసర, వరి వంగడాలు, పత్తివిత్తనాలు వ్యవసాయశాఖ సబ్సిడీపై సరఫరా చేయకపోవడంతో బహిరంగ మార్కెట్లో అధికధరకు కొనుగోలు చేయాల్సి వస్తోందన్నారు. రాష్ట్రప్రభుత్వం రైతుల సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యధోరణి అనుసరిస్తోందని విమర్శించారు. సబ్సిడీపై గతంలో ఇచ్చే తైవాన్ పంపులు, పవర్ స్ప్రేయర్లు, టార్పాలిన్ పట్టాలు కూడా ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతుసంఘ నాయకులు దాడి ఆదినారాయణ, ముచ్చింతల వెంకటేశ్వరరావు, పంబి మోహనరావు, పరసా పుల్లయ్య, అక్కసాని రాఘవులు పాల్గొన్నారు.